క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బూర్జ: ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ విధానం పేదలకు వరమని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.రాజశేఖర్ అన్నారు. నీలాదేవిపురం గ్రామ సచివాలయం పరిధి వావాం పంచాయతీ ఉవ్వపేట గ్రామంలో మంగళవారం ఫ్యామిలి ఫిజీషియన్ డాక్టర్ విధానం కార్యక్రమం నిర్వహించారు. 58 మంది రోగులకు సేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘ కాలిక కేసులు బీపీ, సుగర్ కేసులకు ఇంటింటికీ వెళ్లి తని ఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో బూర్జ పీహెచ్‌సీ సీహెచ్‌వో కె.అప్పలస్వామి, ఎంఎల్‌హెచ్‌పీ పి.అలేఖ్య, ఏఎన్‌ఎం గౌరి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

జలుమూరు: మండల పరిషత్ అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆయా ఎంపీటీసీల పరిధిలో పనులు చేసేందుకు అవసరమైన నిధులు, ప్రణాళికలపై చర్చించారు. ఎంపీడీవో దామోదరరావు, వైస్ ఎంపీపీ డోల నాగరత్నం, జేఈ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

పార్వతీనగర్‌కాలనీలో వైరల్ జ్వరాలు



ఫాగింగ్ చేయిస్తున్న హెల్త్ సిబ్బంది

పొందూరు: స్థానిక పార్వతీనగర్ కాలనీలో ఒకే ఇంటిలో ముగ్గురు చిన్న పిల్లలకు వైరల్ జ్వరాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న తాడివలస వైద్య సిబ్బంది మంగళవారం గ్రామానికి చేరుకొని జ్వరపీడితలకు రక్త పరీక్షలు చేయించి మందులను అందజేశారు. పిల్లల ఇంటిలో, వీధిలో, చదువుతున్న పాఠశాలలో ఫాగింగ్ చేయించారు. కాలువలు, రోడ్లపై బ్లీచింగ్ చల్లించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వేడి నీటిని తాగాలని సూచించారు.

ఆస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం



ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో కాయకల్ప బృందం సభ్యులు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిని రాష్ట్ర కాయకల్ప బృందం మంగళవారం తనిఖీ చేసింది. డాక్టర్ నాగశివ జ్యోతి, పీవీ కిరణ్‌లు పరిశీలించారు. ఆస్పత్రిలో శానిటేషన్ ఎలా ఉంది, ఆపరేషన్ థియేటర్‌లో సౌకర్యాలు, గర్భిణులు, బాలింతలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. గదులను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సూపరింటెండెంట్ జయశ్రీ నుంచి పలు వివరాలు తీసుకున్నారు.

గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో ఉపాధి గ్రామసభ



గ్రామసభలో అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తూరు: గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో సర్పంచ్ పెదకోట సాధుబాబు అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ జరిగింది. పంచాయతీలో 2022 ఏప్రిల్ ఒకటో తేది నుంచి 2023 మార్చి 31 తేదీ వరకు ఎన్‌ఆర్‌జీఈఎస్ పథకం ద్వారా ఖర్చు చేసిన రూ. 54 లక్షల నిధుల వ్యయంపై గ్రామ సభలో చర్చించారు. పనులను సోషల్ ఆడిట్ బృందాలు పరిశీలించాయి. పనుల వివరాలను డీఆర్‌పీ సతీష్ ఆధ్వర్యంలో సభలో చదివి వినిపించారు. ఎటువంటి సందేహాలు ఉంటే సమాచారం తెలపాలని కోరారు. వేతనదారులు అడిగిన ప్రశ్నలకు ఆడిట్ బృందం సభ్యులు సమాధానాలు ఇచ్చారు. నూతనంగా ఏర్పడిన పునరావాస కాలనీలో మొదటిసారిగా గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జోత్స్న, టెక్నికల్ అసిస్టెంట్ అరుణ ఉన్నారు.

పీహెచ్‌సీకి మహర్దశ



ఆధునికీకరణ చేసిన తరువాత..



శిథిలావస్థలో ఉన్న పీహెచ్‌సీ భవనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ పట్టింది. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధుకీకరించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా వివిధ పరికరాలను సమకూర్చారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీని 48 లక్షల రూపాయలతో అభివృద్ధి చేశారు. గతంలో శిథిలమైన భవనం, చిరిగిపోయిన బెడ్లు, మందుల కొరతతో వైద్యం కోసం వచ్చే రోగులు అవస్థలు పడేవారు.

ఇది కదా.. అభివృద్ధి



పాడైన పడకలు



కార్పొరేట్‌స్థాయిలో బెడ్లు ఏర్పాటు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇద్దరు వైద్యులు, పూర్తిస్థాయిలో సహాయ సిబ్బందిని నియమించారు. అలాగే అంబులెన్స్ సేవలు కూడా అందుబాటులోకి రావడంతో రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–సరుబుజ్జిలి

రొట్టవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



నరసన్నపేట: రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మురళి

సరుబుజ్జిలి: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను రెండు విడతల్లో నిర్వహించిందని ఎంపీడీవో బి.రత్నం తెలిపారు. మండలంలోని రొట్టవలస గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నరసన్నపేట: చెన్నాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఆరంగి మురళి శిబిరాన్ని ప్రారంభించగా సైరిగాం పీహెచ్‌సీ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 310 మందికి తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు నేతింటి రాజేశ్వరరావు, రువ్వ వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొంక్యాన నర్శింహమూర్తి, మల్ల విశ్వనాథం పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట



సూర్య నమస్కార పూజలు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: కొరసవాడ గ్రామంలోని మార్కెట్ వీధిలో ఉన్న ఉమాసోమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠామహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుసరాపు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, మూల మంత్రజపాదులు, నమకపారాయణలు, పుష్పాధివాసం, నీరాజన మంత్రపుష్పములు సంకల్పం, మంటపార్చనలు పూజలు నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.లోకేశ్వరరావు సమక్షంలో కొరసవాడ, కాగువాడ, బూరగాంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తమ్మయ్యపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, సౌకర్యాలు మెరుగు పరుస్తున్నామని ఈఆర్‌వో రామోహనరావు అన్నారు. మండలంలోని తమ్మయ్యపేట, మడపాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పూర్తి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం నరసన్నపేటలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మడపాం పంచాయతీ బుచ్చిపేటలో పోలింగ్ కేంద్రం నూతనంగా కావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరగా బుచ్చిపేట స్కూల్‌ను పరిశీలించారు. రాజకీయ పార్టీల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఏపీవో రవి

మెళియాపుట్టి: ఉపాధిహామీ పనుల్లో నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని, కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీవో రవి అన్నారు. ముకుందాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. వేతనదారులు రెండుపూటలా పనులు చేయడం ద్వారా పూర్తిస్థాయి వేతనం లభిస్తుందన్నను. సమయపాలన పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. పని కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఎంతమంది పనిలోకి హాజరయ్యారు, ఇప్పటివరకు ఎన్ని పనిదినాలు పూర్తిచేశారో అడిగి తెలుసుకున్నారు. వేతనదారుల సంఖ్య పెంచాలని, 100 రోజుల పనిదినాల కల్పనపై దృష్టిసారించాలని క్షేత్ర సహాయకుడు తిరుపతిరావుకు సూచించారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం లేదు



గొర్రిబందలో ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

సారవకోట: ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన వారికి వెంటనే బిల్లులు మంజూరు అవుతున్నాయని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.గణపతిరావు అన్నారు. లబ్ధిదారులు నిర్మాణాలు త్వరితగతం చేయాలని సూచించారు. మండల కేంద్రంతో పాటు గొర్రిబంద గ్రామంలో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలు చేపడుతున్న వారికి ఆయా స్థాయిల ప్రకారం బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. జిల్లాలో 834 జగనన్న లే అవుట్లలో 75,840 ఇళ్లు మంజూరైనట్టు పేర్కొన్నారు. వీటిలో 34,480 గృహ ప్రవేశాలు జరిగాయన్నారు. ప్రస్తుతం 5,339 గృహాలు ప్రారంభించలేదన్నారు. ప్రారంభించని లబ్ధిదారులకు స్థానిక సిబ్బంది, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభం అయ్యేటట్లు చూడాలన్నారు. డీఈఈ రామమూర్తి, డబ్ల్యూఐ రమణమూర్తి ఉన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా



వాహన తనిఖీల్లో ఎస్‌ఈబీ సిబ్బంది

మెళియాపుట్టి: ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో వాహనాల రాకపోకలపై నిఘా పెంచినట్లు ఎస్‌ఈబీ పోలీసులు తెలిపారు. మండలంలోని ఆంధ్రా–ఒరిసా సరిహద్దుల్లోని వసుంధర చెక్ పోస్టు వద్ద మంగళవారం ముమ్మరంగా వాహన తనిఖీలను నిర్వహించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒడిశా మద్యం తరలిస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇటీవల మద్యం తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఆంధ్రాలో సారా తయారీ తగ్గుముఖం పట్టడంతో దొంగచాటుగా ఒడిశా మద్యం అమ్మకానికి పావులు కదుపుతున్న వ్యక్తులను విడిచి పెట్టేదిలేదన్నారు.

పూత దశలో కట్టిజనుమ



స్కాట్‌పేట వద్ద పూత దశలో ఉన్న కట్టిజనుమ పంట

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న కట్టిజనుమ పంట ప్రస్తుతం పూత దశకు చేరుకుంది. వాణిజ్య పంటల్లో నూనెగింజల దిగుబడిని, విత్తనాలకు ఉపయోగించే కట్టి జనుమ పంటను ఆరుతడి పంటగా సాగు చేస్తున్నారు. ఈఏడాది స్కాట్‌పేట, మోదుగువలస, ఫాక్సుదొరపేట, జాడుపేట, బొత్తాడసింగి, మిరియాపల్లి, కోవిలాం, ధనుకువాడ, వాడవలస తదితర గ్రామాల పరిధిలోని రైతులు కట్టిజనుము సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు తెలిపారు. మరో నెల రోజుల్లో పంట కోతకు వస్తుందని ఏవో పైడి లతశ్రీ తెలిపారు.

రేపటిలోగా పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఆమదాలవలస: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెల 29వ తేదీలోగా సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో సమర్పించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమదాలవలస సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో 1130 మంది సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 969 మంది ఇప్పటివరకు జీవన ప్రమాణ ధ్రువపత్రాలు సమర్పించారన్నారు. మిగిలిన 161 మంది గడువులోగా సమర్పించాలని సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణ రాజు తెలిపినట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సెంట్రల్ పీఎఫ్ కమిషనర్



వైశాలికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సౌత్‌జోన్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వైశాలీ దాయల్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జిల్లా పీఎఫ్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

మామిడిపూతకు మంచుదెబ్బ



మెళియాపుట్టిలో పూతదశలో ఉన్న మామిడి చెట్టు

మెళియాపుట్టి: కొద్దిరోజులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో దట్టంగా కురుస్తున్న పొగ మంచుప్రభావంతో మామిడి పూత మాడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి నెలలో పిందె తయారవడం ప్రారంభం కావడంతో ఇటువంటి సమాయాల్లోనే జాగ్రత్తలు అవసరమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పూత రావడానికి ముందే తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి దానకర్ణుడు తెలిపారు. పిందె రాల్చకుండా తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులపై గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు చెబుతున్నారని, వారందించిన సలహాలు, సూచనలను రైతులు పాటిస్తే మంచుప్రభావం ఉన్నా పూత, పిందె రాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు.

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'

సమావేశానికి తరలిన నరసన్నపేట నాయకులు



మంగళగిరి సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కృష్ణదాస్, నాయకులు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మండల స్థాయిలో వైఎస్సార్‌సీపీ కేడర్‌ను సన్నద్ధం చేస్తూ.. వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు మంగళవారం మంగళగిరిలో నిర్వహించిన 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' సమావేశానికి నరసన్నపేట నాయకులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కనుసు సీతారాం, నాయకులు కణిత కృష్ణమూర్తి, వరుదు వంశీ కృష్ణ లుకలాపు రవి, జేసీఎస్ కన్వీనర్లు సురంగి నర్శింగరావు, కణిత సత్తిబాబు, ధర్మాన జగన్, నక్క తులసీదాస్ వెళ్లారు. ఈ సందర్భంగా మండల జేసీఎస్ కన్వీనర్ నర్శింగరావు, మండల పార్టీ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. ఎన్నికల దృష్ట్యా అనేక సూచనలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారని అన్నారు. మనకున్న ఓటు బ్యాంకును పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారని అన్నారు. ఇటువంటి సమావేశాలు నిర్వహించడం ద్వారా నాయకుల్లో ఉత్సాహం పెరుగుతోందన్నారు.

జగన్‌ను గెలిపించేందుకు 'సిద్ధం'

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ శ్రేణులు

ఎల్.ఎన్.పేట: వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు మేము సిద్ధం అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన 'మేము సిద్ధం– మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ పోలింగ్ బూత్‌లోను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, ఏజెంట్లను, పార్టీ కార్యకర్తలు, అభిమానులను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు పాతపట్నం నియోజకవర్గం యువ నాయకులు రెడ్డి శ్రావణ్ కుమార్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బడులు బాగున్నాయి



దేశవానిపేట స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతూ సదుపాయాలపై ఆరా తీస్తున్న ఏపీఈడబ్ల్యుఐడీసీ చైర్మన్

నరసన్నపేట: నాడు–నేడు నిధులతో అభివృద్ధి చేసిన పాఠశాలలు బాగున్నాయని, నిర్వహణపై మరింతగా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని ఆంధ్ర ప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల చైర్మన్ ఎస్.నాగార్జున రెడ్డి అన్నారు. స్థానిక దేశవానిపేట యూపీ స్కూల్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. స్కూల్‌లో మౌలిక వసతులు అన్నీ బాగున్నాయని, నిర్వహణ కూడా బాగుందని ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే మిగిలిన స్కూల్స్‌లో నిర్వహణ ఇలానే ఉండాలని సూచించారు. బాత్ రూములు, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా స్కూల్లో విద్యార్థులతో మాట్లాడి బెంచీలు, మధ్యాహ్న భోజనం ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. 'జగన్ మామ అన్ని సదుపాయాలు కల్పించారు. స్కూల్స్ చాలా బాగున్నాయి' అని విద్యార్థులు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఈఈ డీవీఎన్ మూర్తి, ఏఈ బి.చంద్రమౌళి ఉన్నారు.

పీఎం జన్‌మన్ రెసిడెన్షియల్ పాఠశాలకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పాతపట్నం: కొదూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.2.30 కోట్లతో ప్రధానమంత్రి జంజతి ఆదివాసీ నయా మహాఅభియాన్ (పీఎం జన్‌మన్) రెసిడెన్సియల్ పాఠశాల మంజూరైందని ఎంఈవో బోయిన శ్రీధర్ అన్నారు. కొదూరు గ్రామ సమీపంలోని సూదికొండ పక్కన రెసిడెన్సియల్ పాఠశాల కోసం రెండు ఎకరాల స్థలాన్ని ఎ.ఎల్.ఎస్ కోఆర్డినేటర్ జనార్దనరావు, మండల సర్వేయర్ రామగణపతిలు మంగళవారం పరిశీలించారు. అలాగే ప్రహారాజపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 252లో రెండు ఎకరాల స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్ఎస్ఏ) జనార్దనరావు మాట్లాడుతూ.. జిల్లాలోని పాతపట్నం మండలం కొదూరు, హిరమండలం మండలంలోని సీది, శుభలయ, మందస మండలంలోని కుదుమైంగిల్‌లో పీఎం జన్‌మన్ రెసిడెన్సియల్ పాఠశాలలు మంజూరైనట్టు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలలో 50 మంది ఎస్టీ విద్యార్థులు చదువుకోవడానికి వీలుంటుందన్నారు. పరిశీలనలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏడీ లక్షణరావు

- ఏడీ లక్ష్మణరావు

బూర్జ: ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని భూగర్భ జలశాఖ ఏడీ లక్ష్మణరావు అన్నారు. మండలంలో కురింపేట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంట నీరు ప్రణాళికపై కాశీ సాగరం ఆయకట్టు రైతులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తక్కువ నీటితో పండించిన పంటలను వేసుకొని రైతులు ఉత్పత్తి ఉత్పాదకతను మెరుగు పర్చుకోవాలని సూచించారు. ఫిజియో మీటర్ ద్వారా ప్రతినెల భూగర్భ స్థాయిని తెలుసుకోవచ్చునన్నారు. తద్వారా ఆ నేలపై ఏరకమైన పంటలను వేసుకోవచ్చో గుర్తించవచ్చునాన్నరు. కార్యక్రమంలో సీనియర్ జియాలజిస్ట్ రమా శ్రీదేవి, సర్పంచ్ కె.వి.ఎస్.సీతారామరాజు, గ్రామ పెద్ద కె.వెంకటరావు పాల్గొన్నారు.

జగనన్న మార్టులతో మహిళాభ్యున్నతి



మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మహిళల అభివృద్ధికి జగనన్న మహిళా మార్టులు ఎంతగానో దోహదపడుతున్నాయని మెప్మా డైరెక్టర్ వి.విజయలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం నగరంలో రైతు బజారు వద్ద జగనన్న మహిళామార్ట్ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా మార్ట్‌ను నగరపాలక సంస్థలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల రూ.150 వాటాధనంతో ప్రారంభించినట్లు చెప్పారు. మొత్తం వాటా ధనం రూ.27.54 లక్షలు కాగా, నేటికి నికర ఆదాయం రూ.13.63 లక్షలు రావడం అభినందనీయమన్నారు. వచ్చిన నికర ఆదాయంలో 35% డివిడెంట్ రూ. 9.18 లక్షలను సంబంధిత స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేసినట్లు చెప్పారు. రిసోర్స్ పర్సన్లు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. రాష్ట్రంలో ఏ పథకం అమల్లో అయినా శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానంలో ఉంటుందన్నారు. పలాసలో మరో మార్ట్ ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, మెప్మా ప్రధాన కార్యాలయం అధికారి ఆర్.ఆదినారాయణ, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్‌రావు, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, మెప్మా సిబ్బంది, టౌన్‌లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షులు, రిసోర్స్ పర్సన్లు, మహిళా మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద నాయీబ్రాహ్మణులకు ఆర్థిక సాయం

టెక్కలి: నిరుపేదలకు సాయం చేయాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలని శ్రీకాకుళానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు దొంతికుర్తి త్రినాథరావు, నిర్మల దంపతులు అన్నారు. జిల్లాలోని 61 మంది నిరుపేద నాయీబ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మంగళవారం టెక్కలిలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన తాము ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగవిరమణ చేశామని పేర్కొన్నారు. తమ సామాజిక వర్గంలో నిరుపేదలను ఆదుకోవాలనే ఆశయంతో ఏటా ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా టెక్కలి, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఆచంట శ్రీనివాస్, కృష్ణప్రసాద్, టి.కన్నెన్న, కె.రామారావు, ఎస్.వెంకట్రావు, పాపారావు, ఐ.చిన్నారావు, శంకర్, రాంబాబు, ఖ.దర్మారావు తదితరులు పాల్గొన్నారు.